# శాంతీష్ సెల్



క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

డా॥ ఎస్.సీతారత్నం

**రా**జమండ్రి రైల్వేస్టేషన్‌లో ఆటో దిగి బేగ్ పట్టుకుని నిలబడింది స్నేహప్రియ. విశాఖపట్నం వెళ్ళడానికి ఏ రైలు వుందో కనుక్కొని వస్తానన్నాడు శాంతీష్.

రెండునిముషాలలో పరిగెత్తుకుంటూ వచ్చిన శాంతీష్ - "మేడమ్, స్పెషల్ ట్రెయిన్ ఉంది 10నిముషాలలో వచ్చేస్తుంది. తొందరగా రండి" అని బేగ్ అందుకున్నాడు.

స్నేహ కంగారుగా నడుస్తోంది చేతిలో హేండ్‌బేగ్ మాత్రమే ఉంది. అది కూడా బరువుగా అన్పిస్తోంది. జనాలంతా ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. తోసుకుంటూ వెళ్లిపోతున్నారు అపుడే సెల్ మోగింది. బేగ్‌లో సెల్ తియ్యడం కూడా కష్టమయింది. రైలు అందుకోవాలన్న కంగారులో ఉన్న స్నేహ - ఫోను తీసేలోపే సెల్ ఆగిపోయింది.

"అప్పుడే 8.30 అయ్యింది. అర్ధరాత్రికి గాని చేరలేనేమో."

"కంగారు పడకండి" అన్నాడు శాంతీష్.

"మా బాబుకి బాగులేదు కదా ఏడుస్తున్నాడో ఏంటో" "ఏం కాదు మేడమ్" అన్నాడు శాంతీష్.

మూడవ ఫ్లాట్‌ఫారం మీదికి వచ్చారు. ఇంకా రైలు రాలేదు. ఖాళి బెంచీ మీద బేగ్ పెట్టి కూర్చున్నారు. మాటి మాటికీ వాచీ చూసుకొంటోంది.

"ఏవన్నా తింటారా ? ఇంకా 5ని॥లు ఉంది టైమ్"

"ఏం వద్దుగానీ, నేను పొద్దున్న జన్మభూమికి వస్తాను. జాగ్రత్తగా ఉండండి. బయటికి తిరగడానికి ఎక్కడికీ వెళ్లకండి, మేడమ్ ఒక్కరూ అయిపోతారు."అని జాగ్రత్తలు చెప్తోంది స్నేహ.

యూత్ ఫెస్టివల్‌కి 40మంది పిల్లలతో రాజమండ్రి వచ్చారు స్నేహ, మిత్ర. స్నేహ కొడుక్కి బాగులేదని తెలిసి రాత్రి వెళ్లి పొద్దున్నే మళ్లీ రాజమండ్రి రావాలని బయల్దేరింది. పొద్దున్న ప్రోగ్రామ్స్ హడావిడిలో ఏవీ తినలేదు.

"మేడమ్ ఏవన్నా తినండి."

"వద్దు" అని మళ్లీ శాంతీష్‌కి ఏమన్నా ఇవ్వాలన్పించింది.

"పద, ఏదైనా జ్యూస్ తాగుదాం."

జ్యూస్ తాగుతూ "కేక్ తీసుకోండి. వాటర్‌బాటిల్ కూడా. రైలు ఎక్కగానే ఆకలేస్తుంది" అన్నాడు ఆదరంగా శాంతీష్.

అతని ఆప్యాయతకి కాదనలేకపోయింది. బేగ్‌లో పర్స్ తీసి చేతిలో పెట్టింది. "డబ్బులిచ్చేయ్."

జాగ్రత్తగా డబ్బులు ఇచ్చి చిల్లర పర్సులో పెట్టి చేతికిచ్చాడు.

పూర్తిగా జ్యూస్ తాగకుండానే రైలు వస్తున్నట్టు అనౌన్స్‌మెంట్,

"పద శాంతీష్" అంది కంగారుగా.

బేగ్ తీసుకొని గబగబా నడిచాడు చీకటిగా ఉంది. రైలు జనరల్ బోగీలు ఫ్లాట్ ఫారమ్ కన్నా ముందుకి వెళ్లాయి.

గబగబా నడుస్తూ ఆయాసపడుతూ

"ఇది ఖాళీగా ఉంది." అంది.

" వద్దు మేడమ్, మరీ అంత ఖాళీది ఎందుకు ముందుది ఎక్కండి" అన్నాడు శాంతీష్.

"సరే" అని కొద్దిగా జనం ఉన్నదానిలో ఎక్కింది శాంతీష్ బేగ్

సీటు కింద పెట్టి చేతిలో ఉన్న వాటర్‌బాటిల్, కేక్ ఇచ్చాడు.

"సిగ్నల్ ఇచ్చేస్తారు దిగు" అంది గట్టిగా.

''జాగ్రత్త. కేక్ తినేయండి. మానేయకండి''

"థేంక్యూ" అంది

రైలు కదిలింది. "బై" అంటూనే ఉన్నాడు.

కనబడినంత దూరం చేయి ఊపుతూనే ఉన్నాడు. శాంతంగా కిటికీ ప్రక్కన కూర్చోగానే - ఇందాక ఎవరు చేసారో అని సెల్ తీసింది. మిస్సెడ్ కాల్ - భర్త దినేష్‌ది. వెంటనే ఫోన్ చేసింది.

స్టేషన్‌కి వస్తానని చెప్తూ - మెడలో బంగారం తీసి లోపల పెట్టు అని చెప్పిన భర్త మాట నిజమేననిపించింది. మెడలో గొలుసు తీసింది.

బేగ్‌లో పర్స్ కోసం చూసింది. గుండె గుభేలుమంది. టికెట్‌కూడా అందులోనే వుంది. అయోమయంగా అన్పించి బేగ్ అంతా తిరగేసింది. పెద్ద బేగ్‌కూడా తెగ వెతికింది.

## నిప్పు తుఫాను

**భూ**మ్మీద విస్తరిస్తున్న ఎడారుల్లాగా
ప్రతి మనసులో అమానవీయత
మధ్యాహ్నపుటెండ
మరణాన్ని మోసుకొచ్చినట్లు
ప్రతి కదలికలో అవినీతి
పెనవేసుకుంటున్న
అలవాటయిన కొండచిలువ
మనకి తెలీకుండానే
కన్రెప్పల కింది నుంచి
కాళ్ళకింద ఇసుక రేణువులదాకా
ప్రవహిస్తున్న వెర్రిప్రవాహం...స్వార్థం
మనిషిగా పరాయిగా మారుతుంటే
ఎవరెట్లా పోయినా ఒక వార్త.!
శిశిర వనం మనసుల్లో
ఆర్ద్రత ఇంకిన నిప్పుతుఫానులు
ఇంక విత్తనాలు మొలకెత్తవ్ !
కరిగిపోయే మనిషి జాడా ఉండదు !

- డా॥ సి. భవానీదేవి

గుండె దడదడలాడుతోంది. లోపల చీరలన్నీ సీటు మీద పడేసింది. చుట్టు పక్కల వాళ్లు చూస్తూనే ఉన్నారు.

" ఏమయింది?" అడిగారు.

"పర్సు కనబడలేదు." ఇంచుమించుగా కళ్లనీళ్ల పర్యంత అయింది.

ఏడవడానికి అహం అడ్డొస్తోంది. గట్టిగా ఏడవాలన్పించినంత బాధ.

"బాగా వెతకండి" అన్నారెవరో

" లేదు టికెట్ అందులోనే ఉంది."

సెల్ తీసి ఫోన్ చేసింది శాంతీష్‌కి.

"........హలో పర్స్ పోయింది శాంతీష్ టికట్ పోయింది."

ఫోన్ కట్ అయింది ఏదో గాభరా మూడు సార్లు అదే పరిస్థితి.

"రైలు ఎక్కించిన అబ్బాయి దగ్గర ఉండి పోయిందా?"

"ఏమో, నాచేతిలో పెట్టినట్టే గుర్తు"

"ఫోను చెయ్యండి."

"కట్ అయిపోతోంది."

"ఇంతకీ ఆ కుర్రాడు ఎవరు?"

"మా స్టూడెంట్"

"పర్స్‌లో డబ్బులున్నాయా?"

"ఊ"

"ఇంకేం కుర్రాళ్లని నమ్మలేం అన్నాడు"

ఎందుకో ఆమాట అస్సలు మింగుడు పడలేదు.

"ఆ కుర్రాడు మంచివాడు"

"అందరూ అలాగే ఉంటారు, డబ్బే చెడ్డది."

"లేదండీ...." తెలీని దిగులు.

"అసలు సిగ్నల్ రా వడంలేదు."

"ఏ కార్డ్" ఎవరో ప్రశ్నించారు

"హచ్"

"అది లోకల్‌కే కాని బయటికి పనికి రాదు.అందుకే నేను ఎయిర్‌టెల్ వేయించాను."

"అసలు నేను హచ్ వద్దనే అన్నాను. మా ఆయనే ఇదే గొప్పదన్నాడు....." ఎవర్ని తిట్టుకోవాలో ఏం చేయాలో తెలియడం లేదు స్నేహకి.

"పోనీ, నా సెల్ నుండి చేయండి." అన్నాడు ఎయిర్‌టెల్ కార్డ్ ఉన్న పక్కతను.

"నెంబర్ చెప్తాను మీరే చెయ్యరా, ప్లీజ్"

"చెప్పండి.... కట్ అవుతోంది."

"కట్ చేస్తున్నాడంటారా?"

"చేసినా చెయ్యొచ్చు..." మామూలుగా ఉన్న పెద్దాయన యథాలాపంగా కామెంట్ చేసారు.

ఇకం కన్నీళ్ళు ఆపుకోవడం సాధ్యం కాలేదు స్నేహకి.

"ఏడవకండి, అంతా లేమా" అన్నాడు ఎదురుగా ఉన్న కుర్రాడు.

"టి.సి. వస్తే లెక్చరర్ అయిఉండి టికెట్ తీసుకోలేదా అంటాడేమో! ఫైన్‌కి కూడా డబ్బులు లేవు."

"ఏంఫరవాలేదు. అసలు టి.సి. రాడుగా"

"ఏమైనా, నా దురదృష్టం కొద్దీ ఈ రోజే రావచ్చు గదా!" ఆ క్షణం వాళ్లంతా పరాయి వాళ్లనే సంగతే మరచిపోయింది.

"అబ్బ, బాధపడకండి. వస్తే నేను డబ్బులిస్తా, ఫైన్ కట్టేయండి." ఆ మాటకి రిలీఫ్‌గా అన్పించింది.

"మీరెక్కడుంటారు. పేరేంటి?"

"నాపేరు రామలింగేశ్వరరావు, నేను బిజినెస్ చేస్తాను. మా పిల్లల్ని విజయవాడ రెసిడెన్షియల్ కాలేజీలో జాయిన్ చేసాను. చూసిరావడానికి వెళ్లాను. మాది శ్రీకాకుళం జిల్లాలో వీరఘట్టం" అంటుండగానే సెల్ రింగయింది.

ఆత్రుతగా తీసింది స్నేహ. "హలో !" అనేలోపే సిగ్నల్ పోయింది. "ప్చ్!" అని నిట్టూర్చింది.

"బి.ఎస్.ఎన్.ఎల్ వేయించండి. ఎంతైనా గవర్నమెంటుదే మంచిది" అన్నాడు సైడ్ అప్పర్‌లో పడుకున్న గవర్నమెంటు ఉద్యోగి

"రిలయన్స్ బాగుంది, సెల్ టు సెల్ ఫ్రీ నేను బెంగుళూరులో మా మిసెస్ విశాఖలో ఉంటాం. ఎంతసేపు మాట్లాడుకున్నా పరవా లేదు." మరొకరి అభిప్రాయం.

"మా అత్తవారింట్లో రిలయన్స్ అందుకనే నేనూ అదే వేయించాను. లేకుంటే మా ఆవిడ బిల్లు పేల్చేస్తుంది అన్నాడు" మరొక నడి

వయసతను.

"ఆ, అంతా మాయ, అన్ని సెల్‌కార్డ్‌లు ఒకటే దబ్బు గుంజుతాయి. కాస్త వెనకా ముందూ అంతే అన్నాడు"25 ఏళ్ల కుర్రాడు.

"నిజమే అంతా మాయే," అని అంతా ఏకగ్రీవంగా వొప్పేసుకున్నారు.

వారి మాటలు ఏవీ పూర్తిగా బుఱ్ఱలోకి వెళ్లలేదు స్నేహకి. సీటులో ఉన్న చీరలు అన్ని ఒక్కొక్కటే దులిపి మళ్లీ బేగ్‌లో పెడ్తోంది. ఏదో ఆశ పర్స్ దొరుకుతుందేమోనని.

పచ్చచీర పొందికగా కట్టుగొని చిన్నముడి వేసుకొని వొబ్బిడిగా కూర్చునామె అంతసేపూ ఏవీ పట్టించుకోలేదు. సడన్‌గా.

"నేనొకటి అడగనా" అంది భర్తతో.

"ఏంటీ?"

"మా ఆవిడ బిల్లు పేల్చేస్తుందన్నారు కదా! అసలు నేను మా వాళ్లతో నెలకి ఎన్నిసార్లు మాట్లాడతాను"

"మాట్లాడినప్పుడే"

"మాకూ తల్లి తోడూ ఆశ ఉంటుందిగా. నెలకొకమారు కూడా మాట్లాడకపోతే ఆఫోను దిష్టిబొమ్మలా దేనికి?"

"బిల్లు కడితే తెలుస్తుంది."

"ఈ మాటలకేం గానీ, మా రాజేశ్వరి కూతురు నెలాఖరికి వస్తుందిట. దానికి చీర పెడ్తారా?"

"ఎందుకు?"

"రెండుసార్లు వెళ్లినప్పుడు పెట్టిందిగా. ఈ పచ్చచీర అది పెట్టిందే" అని కట్టుకున్న చీరకొంగు చేతిలోకి తీసుకొని చూపించింది.

"ఒకరికొకరు బాగానే పెట్టేసుకొంటారు ఆడవాళ్లు. ఈ కల్చర్ మాత్రం మార్చలేం."

"మీ కల్చర్ మాత్రం ఏం మారిందట, ఆవిడని, పుట్టింటివాళ్లను దెప్పడమే కదా."

"సర్లే ఇది రైలు, ఇల్లు కాదు వాదించకు"

"చీర పెడ్తారా?"

"చూద్దాంలే" అన్నాడు విసుగ్గా.

అప్పుడే ఎయిర్‌టెల్ అతను "హలో పర్స్ ఉందా" అన్నాడు.

"మేడమ్ మీ స్టూడెంట్. పర్స్ ఉందిట, ఇదిగో మాట్లాడండి'' అని ఫోన్ చేతిలో పెట్టాడు.

"హలో ! శాంతీష్.. థేంక్యూ....థేంక్యూ" నవ్వు ముఖంలోకి వచ్చింది.

''ఉందా?'' అని అంతా ఒకేసారి ప్రశ్నించారు.

''ఉందండీ. రైలు ఎక్కుతున్నప్పుడు జారిపోయి వుంటుంది. ఎలకపిల్లలా ఉండటం వలన ఎవరూ తియ్యలేదన్నాడు. టికెట్ విశాఖ స్టేషన్‌కు ఫేక్స్ చేస్తానన్నాడు. మా ఆయనకు కూడా ఫోన్ చేసాడట. మా ఆయనని రెండు ప్లాట్‌ఫామ్ టికెట్స్ కొని తెమ్మన్నాడట. అసలు టికెట్ ఎవరూ అడగరు – నన్ను నమ్మండి అన్నాడు" అని గుక్కతిప్పుకోకుండా చెప్పింది.

"మంచి కుర్రాడు" అన్నారు.

"అవునండీ చిన్నకుర్రాడయినా ఎంత ఊరట ఇచ్చాడో మనసుకి" అంది స్నేహ.

" ఎంతైనా శిష్యులు. శిష్యులే. టీచర్స్‌ది నోబెల్ జాబ్...." అన్నాడు పెద్దాయన.

మళ్లీ ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు.

అప్పుడే సెల్‌మోగింది. ఎవరిదా అన్నట్లు చూసింది స్నేహ.

"మేడమ్" "మీ హేండ్ బ్యాగ్‌లో నుండీ, మీదే"

"ఆ..." నాదే అని కంగారుగా తీసింది.

"హలో శాంతించావా?" అన్నాడు భర్త దినేష్. "ఆ...""అసలు అనపర్తిలో దిగిపోదామా అనుకున్నాను. వీళ్ళంతా వద్దన్నారు. చాలా హెల్ప్ చేసారు అందరూ" అంది.

"ప్రపంచీకరణలో వచ్చిన అనవసరపు అలవాట్లలో ఒకటి సెల్ అన్నావు. ఇప్పుడు అదే ఉపయోగపడింది. సైన్స్ ఎండ్ టెక్నాలజీ వలనే సుఖపడుతున్నాం. తెలుసుకో" అన్న భర్త దినేష్ మాటల గురించే ఆలోచిస్తున్న స్నేహకి

"శాంతీష్ ఒక్కమాటతో పర్సు లేదంటే... శాంతీష్ సెల్ ఉపయోగపడేదా" అన్పించింది. శాంతీష్ సెల్ అతనిలోని నీతి, మంచితనం వలన మాత్రమే ఉపయోగపడిందనుకొని – విశ్రాంతిగా వెనక్కి జారగిలబడి కిటికీలో నుండి కన్పిస్తున్న నిండు జాబిలిని తృప్తిగా చూసింది.

# హైకూలు

## పి. లక్ష్మణరావ్

కీటకం కాదు
సీతాకోక చిలుక
ఋతు విహంగం !

విజ్ఞాన జ్యోతి
ప్రకృతి నిఘంటువు
అర్థం చూసుకో !

నిటారు చెట్టు
గర్వం లేదని చిహ్నం
కొమ్మ రెమ్మలు !

కవి భావాలు
అక్షర కిరణాలు
సూర్య సమానం !

విజయం తథ్యం
దుఃఖ సంద్రంలోనైనా
కాలపరీక్ష

దోపిడీ తత్వం
దినదిన ప్రవృద్ధి
రాక్షసానందం !

భయం గుప్పిట్లో
జనసంద్రం ఇక్కట్లు
సునామీ పంజా !

ద్వేషాలే సాక్ష్యం
ఆనవాలు కోల్పోతూ
అనుబంధాలు !